క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించండి

వీరఘట్టం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. ఆదివారం స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడైన బోర్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు.

ఉద్యోగోన్నతి


విజయ్ గణేష్

వీరఘట్టం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న విజయ్‌గణేష్‌కు ఆర్‌ఐగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగోన్నతిపై సీతంపేట మండలానికి బదిలీ జరిగిందని పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

సీతానగరం: శంబర పోలమాంబ జాతరను పురస్కరించుకుని భక్తులు రాక పోకల దృష్ట్యా చినభోగిలి, బగ్గందొరవలస గ్రామాల సర్పంచ్‌ల పర్యవేక్షణలో రోడ్డుకు ఇరువైపులా పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు ఆదివారం చినభోగిలి సర్పంచ్ కె రాధ, పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావుల ఆధ్వర్యంలో చినభోగిలి రైల్వే గేటు నుంచి కాలనీవరకూ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగింపు చర్యలు చేపట్టారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ల సహాయంతో దూర ప్రాంతాలకు తరలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ శంబర పోలమాంబ జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చిన భోగిలి, తామరఖండి బగ్గందొరవలస, కొత్తవలస బల్లకృష్ణాపురం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


పతాకాన్ని ఆవిష్కరించిన వైస్ ఎంపీపీ టి. సూర్యనారాయణ

సీతానగరం: మండలంలోని నిడగల్లులో భక్తులు నిర్మించి పూజలు చేస్తున్న షిరిడీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు పి లక్ష్మణరావు, వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణల ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం నిర్మించి పలుగ్రామాల సాయిభక్తులకు పూజలు నిర్వహించడానికి వీలుగా వసరులు కల్పించారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వందలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు.

శ్రమదానంతో రహదారులు..

సాలూరు: కూటమి ప్రభుత్వంలో వంద రోజుల్లో వంద రోడ్లు, ముమ్మరంగా అభివృద్ధి పనులు అంటూ ఆర్భాటాలు చేస్తున్న నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు పక్కనపెడితే, గిరిశిఖర గ్రామాల్లో గిరిజ నులు శ్రమదానంతో రోడ్లు వేసుకుంటున్న పరిస్థితి. స్వయానా గిరిజనసంక్షేమశాఖామంత్రి, స్త్రీశిసుసంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోనే సాలూరు మండలం కొదమ పంచాయతీలో గల చింతామల గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్నా రు. గిరిశిఖర చింతామల నుంచి సమీప ఒడిశా రాష్ట్రం శబ్కమారి వరకు సుమారు మూడున్నర కిలోమీటర్లు శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్నా రు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషితో పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు సమీపం రోడ్డు నుంచి లొద్ద వరకు రోడ్డు మంజూరుచేసి పనులు చేపట్టారు.లొద్ద నుంచి చింతామలకు సుమారు 5 కి.మీ.దూరం ఉంది. ఇదంతా పూర్తిగా అటవీప్రాంతం. అయితే తమకు ఎప్పటికీ రోడ్డు పూర్తికాకపోవడంతో ఇటు ఆంధ్రా కంటే అటు వైపు దగ్గరగా ఉన్న ఒడిశా వైపు రోడ్డు వేసుకోవాలని గిరిజనులు భావించారు. ఈ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణం చేస్తుందన్న నమ్మకంలేని గిరిజనులు శ్రమదానంతో చింతామల నుంచి శబ్కమారికి రోడ్డును వేసుకుంటున్నారు. అటవీమార్గంలో రాళ్లు, రప్పలు, కొండలు దొలచి, చెట్లు, మొక్కలను తొలగించి రోడ్డును వేసుకున్నారు.


గరుగుబిల్లి తహసీల్దారు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జెండా వందనం చేస్తున్న ఎంపీడీవో పైడితల్లి, ఉప తహసీల్దారు సుందరరావు


గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ఎంపీపీ దీనమయ్య, ఎంపీడీవో సాల్మన్‌రాజు


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో మువ్వన్నెల జెండా రెపరెపలు


కొమరాడ పోలీస్‌స్టేషన్ వద్ద జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న ఎస్‌ఐ నీలకంఠం


కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణతంత్ర వేడుకల్లో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి


పాలకొండ: గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

వాడవాడలా గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఏటా ఈ దినోత్సవం జరుపుకుంటుండడం విశేషం. గణతంత్ర రాజ్యంలో ప్రజలే ప్రభుత్వమని.. ప్రభుత్వమే ప్రజలని.. ఇక్కడ రాజ్యాధికారం ప్రజలది.. వారు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులది అని వక్తలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలు పాటించి, రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


పాలకొండ: వివేకానంద పాఠశాలలో విద్యార్థుల విన్యాసాలు


పాలకొండ: జెండా ఎగురవేస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు


పాలకొండ రూరల్: న్యాయస్థానం ఆవరణలో జెండా వందనం చేపడుతున్న న్యాయమూర్తి కృష్ణసాయి తేజ, తదితరులు


జియ్యమ్మవలస: అల్లువాడ పాఠశాల వద్ద గణతంత్ర వేడుకలు


వీరఘట్టం: కంప్యూటర్ ఆపరేటర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ దమలపాటి, ఎంపీడీఓ వెంకటరమణ


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తల జెండా వందనం


వీరఘట్టం: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీటీ ప్రసాదరావు, రెవెన్యూ అధికారులు


సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థుల నృత్యం



భామిని: బత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న హెచ్‌ఎం వెంకటరమణ


గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల వద్ద గణతంత్ర వేడుకలు

రైతు సమస్యలపై స్పందించాలి



ర్యాలీ చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పాలకొండ: రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి కోరారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన చట్టాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు, గిరిజన సంఘ నాయకుడు తిరుపతిరావు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

భామిని: మండలంలోని పెద్దదిమిలిలో వెలసిన ఎండల మల్లికార్జునస్వామి సన్నిధిలో జనం సేవా సంస్థ సభ్యులు సిమెంట్ బెంచీలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి జనపాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భక్తులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేశామన్నారు.


సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయిస్తున్న జనం సేవాసంస్థ ప్రతినిధులు

గిరిజన రైతులకు రూ.10 లక్షల స్ప్రింక్లర్ యూనిట్ల పంపిణీ

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల సంస్థ, ఐటీడీఏ భాగస్వామ్యంతో కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని 10 మంది గిరిజన రైతులకు రూ.10.05 లక్షల విలువ గల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను (డ్రిప్, స్ప్రింక్లర్స్)ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం ఐటీడీఏ కార్యాలయంలో పంపిణీ చేశారు. 2024–25వ సంవత్సరంలో సూక్ష్మ నీటిపారుదల పథకం కింద 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్, స్పింకర్స్ యూనిట్లను ఉద్యాన వ్యవసాయ రైతులకు రాయితీపై అందజేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్స్ యూనిట్స్ కలిగిన వాహనానికి పీఓ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ ఎంఐపీ, ఐటీడీఏ సౌజన్యంతో ఈ పథకం కింద 750 స్పింకర్ల యూనిట్లను రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వి.రాధాకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానవన శాఖాధికారి కె.మణి భూషణరావు, మండల సూక్ష్మ నీటిపారుదల అధికారి శాంతిస్వరూప్, డీసీఓ కిశోర్, ఇతర ఏపీఎంఐపీ, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్ప్రింక్లర్ యూనిట్ పంపిణీ చేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

రైతు వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలి

పార్వతీపురంటౌన్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వెళ్తే తీవ్రపరిణామాలు తప్పవని హెచ్చరించారు. రైతు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. దొడ్డి దారిన అమలుకు పూనుకున్న రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, లేబర్‌కోడ్ లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎం.ఎస్ స్వామి నాథన్ సిఫార్స్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి వేతనం, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం చేయాలనీ కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వమే సమర్థవంతంగా నడపాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు బుడితి అప్పల నాయుడు, మోనంగి భాస్కర రావు, బొత్స నర్సింగరావు, పి.సంగం, పాలక రంజిత్ కుమార్, కొల్లి గంగు నాయుడు, నాయకులు రెడ్డి వేణు, తోట జీవ, పోలా రమణి, భాస్కరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు వై. మన్మథరావు, బీవీ రమణ, గ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.ఇందిర, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ జిల్లా నాయకుడు విశ్వేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, గరుగుబిల్లి సూరయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకేంద్రాలను నిరక్షరాస్యులు వినియోగించుకోవాలి

సీతానగరం: మండలంలో నిరక్షరాస్యులైన మహిళల కోసం సోమవారం నుంచి ప్రారంభం కానున్న విద్యా కేంద్రాలను వయోజనులైన మహిళలు విని యోగించుకోవాలని ఎంపీడీఓ పి.త్రిక్రమరావు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి వలంటీర్ టీచర్లు సోమవారం నుంచి సాయంత్రం పూట శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల్లో 50 సంవత్సరాల వయస్సులో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలకు ఫైనాన్షియల్ లిట్రసీ, సస్టైనబుల్, ఫైనాన్సియల్ లిట్రసీపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అర్హులైన మహిళలంతా అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

● ఆకట్టుకున్న వేషధారణలు..


గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరించారు. ఈ మేరకు హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ గణతంత్ర దినోత్సవం విశిష్టతను వివరించారు. - పాలకొండ రూరల్

● ఆకట్టుకున్న అడవి వ్యూ పాయింట్


రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఉద్యానవనశాఖ తయారు చేసిన అడవి వ్యూ పాయింట్ కొండ ఆకట్టుకుంది. మట్టితో కొండను తయారు చేసి దానిపై వివిధ రకాల మొక్కలు, మలుపులు తిరిగిన రహదారులతో సిద్ధం చేసిన ఆర్ట్ ఆదివారం గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించారు. - సీతంపేట

● కమ్ముకున్న పొగమంచు


పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 7 గంటల నుంచే మంచు కురవడం ఆరంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. ఎడతెరిపిలేకుండా పడుతున్న దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. ఎదురుగా వస్తున్న మనిషి కూడా దగ్గరకు వెళ్తే తప్ప కనిపించని దుస్థితి. టార్చిలైట్లు, సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఈ చిత్రంలో కనిపిస్తోన్నది.. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఆదివారం మంచు కురిసిన దృశ్యం. -గుమ్మలక్ష్మీపురం